ఉస్మానియా డెంటల్ ఆసుపత్రిలో పనిచేయని లిఫ్ట్



లిఫ్ట్ పనిచేయకపోవడంతో మెట్లు ఎక్కుతున్న సిబ్బంది

- ఇబ్బందులు పడుతున్న రోగులు, ఆసుపత్రి సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

అబిడ్స్/అఫ్జల్‌గంజ్: ఉస్మానియా డెంటల్ ఆసుపత్రిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చి మూడు నెలలైనా గతంలో ఉన్న సమస్యలు అలాగే ఉన్నాయి. నాలుగు అంతస్తుల ఉస్మానియా డెంటల్ ఆసుపత్రి భవనంలో లిఫ్ట్ పనిచేయక కొన్ని నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. డెంటల్ ఆసుపత్రికి వచ్చే పేషంట్లు, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది నానా కష్టాలు పడుతున్నారు. ఏ సామగ్రి అయినా కింది నుంచి పైకి తీసుకువెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. కొన్ని నెలలుగా లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఉస్మానియా డెంటల్ ఆసుపత్రిలో సమస్యలు ఇంత దారుణంగా ఉండడంతో అందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఆసుపత్రి పరిసరాల్లో అనుకున్నంత స్థాయిలో పరిశుభ్రత లేదని పలువురు పేర్కొంటున్నారు.

ఆరోగ్య మంత్రి వెంటనే సమస్యలు పరిష్కరించాలి: సత్తి ప్రకాష్‌రెడ్డి

ఉస్మానియా డెంటల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా స్పందించి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ డిపార్ట్‌మెంట్స్ వైస్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది కత్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రుల పర్యావేక్షణ, అభివృద్ధి దారుణంగా ఉండేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పనిచేయని ఉస్మానియా డెంటల్ ఆసుపత్రి లిఫ్ట్‌ను తమ ప్రభుత్వ హయాంలో వెంటనే మరమ్మతులు చేసేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలోనే రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహాను కలిసి ఆసుపత్రిలో ఉన్న సమస్యలన్ని స్వయంగా వివరించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు.

సకాలంలో జీతాల చెల్లింపుపై హర్షం



గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు ఒకటవ తేదీనే ప్రభుత్వం చెల్లిస్తోందని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం గృహకల్ప భవన సముదాయంలోని నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో జరిగిన సమావేశంలో వారు ప్రసంగించారు. గతంలో జీతాలు ఎప్పుడు పడుతాయో తెలియని దుస్థితి ఉండేదన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి రోజునే జీతాలు చెల్లించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, సహచర మంత్రివర్గ సభ్యులకు, సీఎస్ శాంతికుమారికి నాల్గవ తరగతి ఉద్యోగుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలు జిల్లాలకు చెందిన నాల్గవ తరగతి ఉద్యోగులు కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులను సత్కరించారు.

వేసవిలో ప్రతి ఇంటికీ తాగునీరు: ఎమ్మెల్యే కౌసర్



మలాయిమెట్‌లో నల్లాలో వస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: వేసవిలో ప్రతి ఇంటికీ తాగునీరు అందుతుందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్, మలాయిమెట్, తాళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల వారు తమ ఇళ్లల్లో నల్లాలో వస్తున్న నీరు తాగునీటి అవసరాలకు సైతం సరిపోవడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడుతూ.. ప్రధాన నీటి పైపునకు దూరంగా ఉన్న ఇళ్లకు లోప్రెజర్ సమస్య ఉండి ఉండవచ్చునని అంతేకాకుండా నీటి పైపులు దిగువ ప్రాంతంలో ఇళ్లు ఎగువ ప్రాంతంలో ఉండడం వల్ల కూడా లోప్రెజర్ సమస్య తలెత్తుతుందని ఆయన అన్నారు. ఇటువంటి ప్రాంతాల్లో బూస్టర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తానని ఆయన అన్నారు. ఇటువంటి ప్రాంతాలు కార్వాన్ నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాలు ఉన్నాయని ఆ ప్రాంతాల్లో బూస్టర్లు ఏర్పాటు చేయడం వల్ల లోప్రెజర్ సమస్య పరిష్కారం అయిందని అన్నారు. ఈ వేసవిలో ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు పక్కా ప్రణాళికతో జలమండలి అధికారులు ఉన్నారని ఆయన అన్నారు. ఇప్పటికే తాను జలమండలి ఉన్నతాధికారులతో వేసవిలో నీటి సరఫరాపై ప్రశ్నించడం జరిగిందని జలమండలి మెనేజింగ్ డైరెక్టర్ నీటి నిల్వ పుష్కలంగా ఉన్నాయని కార్వాన్ నియోజకవర్గానికి వేసవిలో సరిపడ తాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారన్నారు.

ఘనంగా ఐఎంఎస్ వార్షిక స్పోర్ట్స్ మీట్



కత్తి వెంకటస్వామిని సన్మానిస్తున్న ఐఎంఎస్ డైరెక్టర్ మిథిలేష్‌కుమార్

జియాగూడ: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించడంతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించడం హర్షనీయమని ఏఐసీసీ నేషనల్ కో ఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి అన్నారు. గురువారం రాత్రి జియాగూడలోని డబుల్‌బెడ్‌రూమ్ ఎంసీహెచ్ ప్లే గ్రౌండ్‌లో ఇంద్రాని మహా విద్యాలయ స్కూల్ ఐఎంఎస్ యానివల్ స్పోర్ట్స్ మీట్ స్కూల్ డైరెక్టర్ మిథిలేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటస్వామి పరేడ్ వందనం స్వీకరించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం డైరెక్టర్ మిథిలేష్‌కుమార్ మాట్లాడుతూ..ప్రతి యేటా విద్యార్థులకు క్రీడల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఓడీ ఇంద్రాణి, దివ్యజ్యోతి, ఇన్‌చార్జి అర్చన, అక్షదీప్ కళాశాల డైరెక్టర్ అక్రమ్ అలీ, టీడీపీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులతోనే మోడ్రన్ స్లాటర్‌హౌస్ నిర్మించాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఉస్మాన్ అలీ, నర్సింగ్‌రావు, శశికాంత్‌రావు తదితరులు

జియాగూడ: జియాగూడలో మోడ్రన్ స్లాటర్‌హౌస్ నిర్మాణం ప్రభుత్వ నిధులతో నిర్మించాలని జియాగూడ ఆరెకటిక సంఘం అధ్యక్షులు టి.నర్సింగ్‌రావు, చర్మకష్ సంఘం అధ్యక్షులు వి.శశికాంత్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.దర్శన్‌కుమార్ కోరారు. శుక్రవారం సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ అలీ హాజ్రీ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు కలిసి సన్మానించి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కొన్నేళ్లుగా ఆధునిక స్లాటర్‌హౌస్ నిర్మాణ పనులు కాలయాపన అయ్యిందన్నారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఈ విషయమై ఎందుకు ఆలస్యమవుతుందో తెలుసుకుని వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఆరెకటిక ట్రస్ట్ సభ్యులు జి.జ్ఞానేశ్వర్, వి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: దివాకరబాబు అద్భుతమైన రచయిత అని భూతకాలం నాటకాన్ని అద్భుతంగా రచించారని ప్రముఖ సినీ నటుడు డాక్టర్ బ్రహ్మానందం అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో కేంద్ర సాహిత్య సాంస్కృతిక శాఖ, గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఎం.దివాకరబాబు రచించిన దివాకరబాబు నాటకములు-నాటికలు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూతకాలం నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి, సినీ రచయిత సాయిమాధవ్ బుర్రా, సినీ నటులు ఎల్బీ శ్రీరామ్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బ్రహ్మానందం తదితరులు

ఉత్సాహంగా జాతీయ సైన్స్ దినోత్సవం



సెన్సింగ్ గురించి వివరిస్తున్న డా.అపర్ణ





ఉపాధ్యాయులతో ప్రము పల్మనాలజిస్ట్ డాక్టర్ గౌస్ అహ్మద్ ఖాన్, సెయింట్ ఆన్స్ కళాశాలలో..

చార్మినార్: సైన్స్ ఎగ్జిబిషన్లు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడతాయని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ గౌస్ అహ్మద్ ఖాన్ అన్నారు. చార్మినార్ నారాయణ ఈ-టెక్నో స్కూల్ అకాడమిక్ ఫెయిర్ సందర్భంగా నిర్వహించిన జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన విద్య, వైద్య, వైజ్ఞానిక సైన్స్ ఎగ్జిబిట్లను తిలకించి అభినందించారు. జాతీయ సైన్స్ ప్రదర్శనకు విద్యార్థులకు పూర్తిగా సహకరించిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్, లక్ష్మీ గౌరి, కో ఆర్డినేటర్లు లక్ష్మీ భవానీ, ఆజాద్, నూర్జహాన్, స్కూల్ ప్రిన్సిపాళ్లు శారద, తహీనియల్, ఏఓ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్, అకాడమిక్ డీన్ పాల్గొన్నారు.

సిటీ కళాశాలలో..

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సిటీ కళాశాలలోని గణిత, గణాంక శాస్త్ర విభాగాలు సంయుక్తంగా శుక్రవారం 'సమాజాభివృద్ధికి రిమోట్ సెన్సింగ్'అనే అంశంపై ఒకరోజు సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్, శాస్త్రవేత్త డా.ఎస్.అపర్ణ హాజరై మాట్లాడారు. ప్రస్తుత సాంకేతిక సమాజంలో రిమోట్ సెన్సింగ్ సమాజానికి ఏ విధంగా ఉపయోగ పడుతుందో అనే విషయాలను వివరించారు. ఉప గ్రహాల ద్వారా గూగుల్ మాప్స్ వ్యవసాయ రంగానికి, పట్టణ ప్రణాళికా అభివృద్ధికి ఎలా ఉప యోగపడుతుందో పీపీటీ ద్వారా వివరించారు. డా.విప్లవ్ దత్ శుక్లా, డా. శారద, డా.పద్మ అనురాధ, డా.శ్రీనివాస రెడ్డి, వేదవతి, డా.నీరజ, డా.వినోదిని, జయదేవ్, మానస, దేవీప్రియ, రుచిత, క్రాంతి కిశోర్ పాల్గొన్నారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానం, దాని ఉపయోగాల గురించి విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించే కార్యక్రమం నిర్వహించిన విభాగాలను ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అభినందించారు.

సమాజ అభివృద్ధికి సైన్స్ దోహదం..

గోల్కొండ: సమాజ అభివృద్ధికి సైన్స్ దోహదపడుతుందని కిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో సైన్స్ ఫెయిర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సైన్స్ ప్రాధాన్యాన్ని వివరించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న సన్‌షైన్ ఆసుపత్రి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనస్థీషియా హెడ్ డాక్టర్ కుబూచంద్ జాకోటియా మాట్లాడుతూ.. మన దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎప్పుడూ ముందుండి ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్లోబల్ ఆసుపత్రి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రసన్న లత, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనుప్ అగర్వాల్, సెయింట్ ఆన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ విజయరాణి, ప్రెసిడెంట్స్ ఆఫ్ స్కూల్స్ అండ్ కాలేజెస్ సూపిరియల్ జనరల్ మదర్ జర్నల్ ఆంథోనమ్మ, ప్రావిజనల్ సూపిరియల్ ఆన్ రోస్, కాలేజీ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ అండ్ రోబోటిక్స్ ఫెస్ట్..

విద్యార్థుల మేధకు పదును పెడితే వారు అద్భుత ఫలితాలు సాధిస్తారని వీనస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకి డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్‌ల జాతీయ సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఎక్స్‌పో అండ్ రోబోటిక్ ఫెస్ట్ జరిగింది. 10వ తరగతికి చెందిన విద్యార్థులు రోబోను తయారు చేసి అందరిని అబ్బురపరిచారు. ఈ సందర్భంగా మహ్మద్ హిదాయత్ అలీఖాన్ మాట్లాడుతూ.. తరగతితో సంబంధం లేకుండా విద్యార్థులకు సైన్స్‌యే కాకుండా ఇతర శాస్త్రాలపై కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ది రైజింగ్ స్టార్ నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ షెబాజ్ అహ్మద్, అలయన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ ఆరీఫ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఆగాపురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఆగాపురా నాలా, నమాజ్ గ్రౌండ్స్, హబీబ్ నగర్ పోలీస్‌స్టేషన్, తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కే.వీ జించి చౌర విద్యుత్ ఫీడర్ పరిధిలోని జించి చౌరా, బోయిగూడ కమాన్‌తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు, 11 కే.వి సీతారామ్‌పేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సీతారామ్ పేట్, ఏక్ మినార్ మజీద్ లేన్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వెనుక లేన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు. 11 కే.వీ ఆర్‌కే పేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్, అజారీ హోటల్, బిలాల్ మజీద్, గంగాబౌలి, బంగ్లాదేశ్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 4 గంటల వరకు. 11 కే.వీ మహాలక్ష్మి నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని శివ్‌లాల్ నగర్, కుమ్మర్‌వాడి, మార్వాడీ బస్తీ, గాంధీ విగ్రహం, హనుమాన్ పీటీ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

ఆహ్వానం



చాంద్రాయణగుట్ట: ఈనెల 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్న చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జుర్కీ రాజేందర్ ఆమెను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఎంతో ప్రాచీనమైన ఆలయంలో ఈనెల 4న జరిగే స్వామి వారి తిరు కల్యాణోత్సవానికి హాజరై తిలకించాలని విజ్ఞప్తి చేశారు.

పురిటి బిడ్డను రోడ్డుపై వదిలేశారు..



డబీర్‌పురా: అప్పుడే పుట్టిన ఆడ బిడ్డను గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసిన ఘటన శుక్రవారం రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం..రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇమ్లిబన్ ఏరియా ప్రాంతంలో శుక్రవారం ఉదయం 8.20 గంటల సమయంలో ఓ వ్యక్తికి శిశువు ఏడుస్తూ కనిపించింది. అక్కడికి వెళ్లి చూడగా ఎవరూ లేరు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆడ శిశువు కోసం స్థానికంగా ఆరా తీయగా ఎలాంటి సమాచారం అందలేదు. ఆచూకీ కోసం రెయిన్‌బజార్ పోలీసులను సంప్రదించాలన్నారు.

ఇసుక లారీల రాకపోకలను నియంత్రించాలి

గోల్కొండ: ఇసుక లారీల రాకపోకలపై నిర్దిష్ట సమయాలను నిర్ణయించాలని పలువురు కోరుతున్నారు. ఇసుక లారీల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని..పాదచారులు, ద్విచక్ర వాహనాదారులే ప్రమాదాలకు గురవుతున్నారని పలువురు బస్తీలు, కాలనీలవాసులు అంటున్నారు. రెండు రోజుల్లో వరుసగా ఇసుక లారీల కారణంగానే ఘోరమైన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు గుర్తుచేశారు. రాందేవ్‌గూడ వద్ద గురువారం ఇసుక లారీ ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా ఆ ప్రమాదంతో బైక్‌పై ఉన్న భార్య, భర్త, కుమారుడితో పాటు ఎనిమిది నెలల గర్భస్థ శిశువు కూడా మృతి చెందడం లారీల అతివేగానికి నిదర్శనమని పలువురు అంటున్నారు. ఏదేమైనా ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఇసుక లారీల ఫిట్‌నెస్ పరిశీలించి ఆ వాహనాల వేగాన్ని నిర్ణయించాలని పలువురు కోరుతున్నారు.

మేరు కులస్తులకు ఎంపీ టికెట్లు కేటాయించండి



మంత్రి కోమటిరెడ్డిని కలిసిన పోల్కం శ్రీనివాస్, ఆదిమూలం శంకర్ తదితరులు

అబిడ్స్: మేరు కులస్తులకు పార్లమెంటు ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రటరి పోల్కం శ్రీనివాస్, రాష్ట్ర మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన మేరు కులస్తులకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. మేరు కులస్తులు వెనుకబడడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాన కారణమని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి సానుకూలంగా స్పందించారు. మేరు కులస్తుల సమస్యలను పార్టీ అధిష్టానానికి వివరించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పోల్కాం వినయ్‌రాజ్, కొండూరు చంద్రశేఖర్, కీర్తి జయంత్, మునగాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ఇందిరా భారతి తదితరులు

అబిడ్స్: బేగంబజార్ కోల్సివాడిలోని ఎస్ఆర్‌డీ రెయిన్‌బో హోమ్‌లో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఓక్‌రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ పిల్లలు, టీచర్లు వారి ఆర్థిక సహాయంతో సుమారు రూ.80 వేల నిత్యావసర వస్తువులకు ఎస్ఆర్‌డీ రెయిన్‌బో పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ఇందిరా భారతి, వీరమణి, వందన, ఎస్ఆర్‌డీ రెయిన్‌బో హోమ్ సిబ్బంది శివరాణి, పార్వతి, క్రాంతికిశోర్, శ్రవంతి, అశ్విని, చంద్రకళ, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..బెల్టు షాపులను మూసివేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి నష్టం వాటిల్లదని బెల్టుషాపులను మూసివేయాలని ప్రభుత్వ నిర్ణయం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా వైన్స్‌లకు అనుమతులు తీసుకున్న వారు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వారి పట్ల తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు బి.బాల్‌రాజ్ గౌడ్, గౌరవ అధ్యక్షులు విజయ్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణ, రాజు గౌడ్, శ్రీధర్‌రెడ్డి, పలు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

పాతబస్తీలో ఉచిత విద్యుత్ బిల్లులు షురూ..

- 200 యూనిట్ల లోపు వినియోగదారులకు గృహజ్యోతి పథకం అమలు
- చార్మినార్ డివిజన్‌లో 60 వేల ప్రజాపాలన దరఖాస్తులు రాగా.. 23,990 అర్హులుగా గుర్తింపు
- అర్హతలున్న మిగిలిన వారి కోసం మరోసారి నమోదు
- జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రజా పాలన పోర్టల్ కౌంటర్ల ఏర్పాటు



డీఈ లింగయ్యతో కలిసి లబ్ధిదారునికి ఉచిత విద్యుత్ బిల్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ

చార్మినార్: ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా పాతబస్తీలో ప్రారంభమైంది. శుక్రవారం టీఎస్ఎస్‌పీడీసీఎల్ చార్మినార్ డీఈ లింగయ్య ఆధ్వర్యంలో సిబ్బంది అర్హులైన వారికి జీరో విద్యుత్ బిల్లులను అందజేశారు. ముఖ్యఅతిథిగా చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ హాజరై హుస్సేనీఆలం సెక్షన్ పరిధిలోని జగదీష్ హట్స్ బస్తీ వినియోగదారులకు విద్యుత్ శాఖ విడుదల చేసిన జీరో బిల్లును అందజేశారు. ఆయన మాట్లాడుతూ..ప్రజా పాలన సందర్భంగా దరఖాస్తులు చేసుకున్న వారు నెలవారీగా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకుంటే..వారందరికీ ఉచితంగా విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. డీఈ లింగయ్య మాట్లాడుతూ.. చార్మినార్ డీఈ పరిధిలోని చార్మినార్, మీరాలం, ఫలక్‌నుమా తదితర మూడు ఏడీఈ పరిధుల్లో 60 వేల ప్రజా పాలన దరఖాస్తులు అందాయని.. ఇందులో 23,990 అర్హత సాధించారన్నారు.

అర్హతలు ఉండి జీరో బిల్లు రాని వారి కోసం..

ప్రజా పాలన సందర్భంగా ఉచిత విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తులు చేసుకున్న అర్హులైన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని..వీరంతా తిరిగి ప్రజా పాలన పోర్టల్‌లో తమ డాక్యుమెంట్లను నమోదు చేయించుకోవాలని డీఈ లింగయ్య సూచించారు. కొన్ని సాంకేతిక కారణాలతో తమ పేర్లు నమోదు కాలేదని..వీరందరి సౌకర్యార్థం జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు తమ తమ కార్యాలయాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారని.. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో పాటు కరెంట్ బిల్లును తీసుకుని ఈ కౌంటర్ల వద్దకు వెళ్తే జీహెచ్‌ఎంసీ సిబ్బంది ప్రజా పాలన పోర్టల్‌లో నమోదు చేసి ఇచ్చే రశీదును తమ కార్యాలయంలోని ఈఆర్‌ఓ కార్యాలయంలో అందజేస్తే..జీరో బిల్లు అమలు జరుగుతోందన్నారు.

పాతబస్తీలో..

పాతబస్తీలోని వినియోగదారుల సౌకర్యార్థం సర్కీపూల్‌బాగ్‌లోని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం, చాంద్రాయణగుట్ట సర్కిల్ కార్యాలయం, మొఘల్‌పురాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ సర్కిల్-9 కార్యాలయం, సంతోష్‌నగర్ సర్కిల్ కార్యాలయం, మలక్‌పేట్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో తమ ధ్రువీకరణ పత్రాలతో వెళ్లి మరోసారి పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలి.

జీరో బిల్లుల పంపిణీ ప్రారంభం



జీరో విద్యుత్ బిల్లులు అందజేస్తున్న చంటిబాబు, విద్యుత్ శాఖ అధికారులు

లంగర్‌హౌస్: పేదల అభివృద్ధికి ఇచ్చిన మాటను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షుడు చంటిబాబు, నగర కార్యదర్శి రఘుపాల్‌రెడ్డి అన్నారు. గృహజ్యోతి పథకం లంగర్‌హౌస్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా లబ్ధిదారులకు విద్యుత్ శాఖ అధికారుల సమక్షంలో శుక్రవారం జీరో విద్యుత్ బిల్లులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, నికిలేష్ తదితరులున్నారు.

మహా శివరాత్రి జాగరణ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, మాడిశెట్టి సదానందం గుప్తా

అబిడ్స్: మహా శివరాత్రి జాగరణ సేవా సమితి వాల్ పోస్టర్‌ను ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా ఆవిష్కరించారు. రహీంపురాలో మహా శివరాత్రి రోజు జాగరణ వేడుకలు వైభవోపేతంగా నిర్వహిస్తామని జాగరణ సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా వెల్లడించారు. ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక భావాలు, భక్తిభావాలు ప్రజల్లో పెంపొందించే విధంగా వేడుకలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తోట శ్రవణ్‌కుమార్, నవిన్‌కుమార్, బీఎస్ఎల్ వర్మ, హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏసీపీకి సన్మానం



చాంద్రాయణగుట్ట: ఛత్రినాక ఏసీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీహెచ్ చంద్రశేఖర్‌ను టీపీసీసీ కార్యదర్శి డీఎల్.నర్సింగ్ గౌడ్ శుక్రవారం సన్మానించారు. ఆయన కార్యాలయంలో కలిసి పూలబొకే అందజేసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి



మహ్మద్ ముజీబ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 37 ఏళ్లుగా ఉద్యోగం చేశానని ఎంతో సంతృప్తితో ఉద్యోగం నుంచి రిటైర్డ్ అవుతున్నానని ఆర్టీసీ సెక్యూరిటీ సబ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ముజీబ్ అన్నారు. ఆయన రిటైర్‌మెంట్‌ను పురస్కరించుకొని శుక్రవారం ఆయన శ్రయోభిలాషులు మహ్మద్ ముజీబ్ దంపతులను పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని చేసే సంస్థ అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు కుటుంబాన్ని గురించి కూడా ఆలోచించాలని ఆయన అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, ఖాలేద్ అలీఖాన్, మహ్మద్ తదితరులున్నారు.

ర్యాలీలకు అనుమతించాలి



సీపీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్, మాజీ ఎమ్మెల్యే పాషాఖాద్రీ

గోల్కొండ: మజ్లిస్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలు ప్రాంతాల్లో శనివారం ర్యాలీలు జరుగుతాయని వీటికి అనుమతించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, మాజీ ఎమ్మెల్యే పాషాఖాద్రీ నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. శుక్రవారం సాయంత్రం వారు నగర పోలీస్ కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. మజ్లిస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి మజ్లిస్ కేంద్ర కార్యాలయం దారుసల్లామ్‌కు వస్తారని వారు తెలిపారు. ఈ ర్యాలీలు శాంతియుతంగా ఉండడంతో పాటు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించవని వారు అన్నారు. వారి వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ ఉన్నారు.

రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర మహిళా దొంగల అరెస్టు

నాంపల్లి: పరుగెడుతున్న రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర మహిళా దొంగలను జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..మహారాష్ట్ర షోలాపూర్‌కు చెందిన భజరంగ్ భార్య రేణుకా జాదవ్(37), దేవజాదవ్ భార్య అనుదేవ్‌జాదవ్(38), శవరప్ప గైక్వాడ్ భార్య సీతాభాయి (49) వృత్తిరీత్యా పాత బట్టల వ్యాపారం చేస్తుంటారు. రైళ్లలో రాకపోకలు సాగిస్తూ ప్రయాణికులతో ముచ్చట పెడుతూ ప్రయాణిస్తారు. ఈ క్రమంలో ప్రయాణికుల ఒంటిపై ఉండే బంగారు ఆభరణాలను దొంగలించడం అలవాటు చేసుకున్నారు. 12 ఫిబ్రవరి 2024న లింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద పరుగెడుతున్న రైలులో పోలీసులు సోదాలు చేసి పట్టుకున్నారు. వీరి నుంచి 20 గ్రాముల రెండు గోల్డ్ చైన్స్, 25 గ్రాముల బంగారం పుస్తెలతాడు, 10 గ్రాముల గోల్డ్ చైన్ (డబ్లూజీ) 20 గ్రాముల నాలుగు బంగారు ఉంగరాలతో పాటుగా రూ.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాద్ డీఎస్ఆర్‌పీ ఎస్.ఎన్.జావెద్ ఆదేశాల ప్రకారం జరిగిన సోదాల్లో హైదరాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ నర్సింగ్ రాథోడ్, కానిస్టేబుల్ షకీల్ పాష, మహిళా కానిస్టేబుల్స్ భాగ్యమ్మ, ఎం.యమున, డి.స్వరూప పాల్గొన్నారు.